

# గేదెమీది పిట్ట

తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి

# Gede midi pitta

**Novel by**

**TALLAVAJJALA PATANJALI SASTRY**

First Edition : December, 2015, Copies: 1,000

For Copies : T.P.Sastry 86 - 4 -16/1, Vadrevu Nagar

RAJAHMUNDRY - 533 103, Cell : 94407 03440

**CHINUKU PUBLICATIONS**

26 - 7 - 11, Garikapativari st, Gandhinagar, Vijayawada- 520 003.

Cell: 98481 32208

Cover Page Design: L.J,

DTP, Title, Layout & Printing & publishers

**CHINUKU Publications**,

Gandhinagar, Vijayawada- 520 003

editor.chinuku@gmail.com

**Price : Rs. 100/-**

# 1.

**అద్దంలో** ముఖం చూసుకుని కొంచెం పమిట సద్దుకుని "ఆది నారాయణ మూర్తీ అయాం రెడీ" అందామె. మూర్తి అరగంట క్రితమే బట్టలు వేసుకుని కూచున్నాడు. 'ఊ' అంటూ లేచి సంచీ భుజానికి తగిలించుకుంటున్న ఆమె నడుం చుట్టూ చెయ్యి వేశాడు. వెనక్కి తిరిగి ఆమె నవ్వింది. అతనామె ముఖంలోకి చూస్తూండి పోయాడు. ఆమె స్పర్శ అతనికి ధైర్యం లాంటిది ఏదో ప్రసారం చేసింది. "ఓకే" అన్నాడతను. అతని భుజం మీద చెయ్యి వేసి అందామె.

"Don't worry. నీ మొహం చూస్తుంటే నాకు బెంగగా ఉంది. అట్లా ఉండకు. రోజల్లా నాకు ఏదోగా ఉంటుంది. పాఠం చెప్పలేను. అలవాటే అనుకో. ధైర్యంగా ఉండు. ఇవన్నీ మనకే గాదు..."

"అందరికీ ఉంటాయి. నువ్వు అవేవీ మనసులో పెట్టుకోకు. వర్రీ అవద్దు...అంతేనా?" ఆమె మాటలకి అడ్డు వస్తూ అన్నాడతను. "నాకు తెలుసు. ఇట్టా ఇంటర్వ్యూలకి వెళ్లినప్పుడల్లా మనసేం బాగోదు. ఏమవుతుందో మనకి ముందే తెలుసు గదా?"

చేతులు తీసి అతని బుగ్గమీద పెదాలానించి అందామె.

"ముందే ఎలా తెలుస్తుంది? నీకు మంచి ఆఫర్ రాదనీ, ఇలాగే మీ కంపెనీలో ఉండిపోతావనీ ఎట్లా తెలుసు నీకు? ఎప్పుడూ ఒకేలా ఉండదు. మంచి జరుగుతుందనే నమ్మకం ఉండాలి. ప్రస్తుతానికి మనకి నడుస్తోంది గదా. Good luck. బాగా చెయ్యి ఇంటర్వ్యూ. పద నాకు టైమవుతోంది బాబూ".

అతను నవ్వి "నీ మాటలు వింటే బాగానే ఉంటుంది. మా అత్త నీ ఫోటో చూపించి, చూడ్రా, మాకు బాగా తెలిసిన అమ్మాయి, మంచి పిల్ల అంటే నేనిప్పుడు పెళ్లి చేసుకోనని ఫోన్ చేశాను. నిజంగా మా

అత్త అంతటితో వదిలేస్తే, నీకు మంచి మొగుడొచ్చేవాడు".

"నీకూ మంచి పెళ్లాం వచ్చి ఉండేది"

"ఏం గాదు"

"మా బావ అన్నాడు, ఈ రోజుల్లో అంతా I.T. హవా నడుస్తోంది. సివిల్ ఇంజనీరింగ్ మామూలే. నేను పట్టించుకోలేదు".

"నా కోసం అలాగే అంటూంటావు".

"కాదు. సరే పద. సాయంకాలం తీరిగ్గా చెప్తాగానీ. చల్".

నాలుగు సంవత్సరాల నుంచీ కొన్ని వాక్యాల తేడాతో ఉదయమో రాత్రో ఇద్దరి మధ్యా ఈ సంభాషణ నడుస్తూనే ఉంది. హాల్లోకి వచ్చేరిద్దరూ. పాప తాతగారి ఒళ్లో కూచుని ఆయన వేళు ్ల లెక్కబెడుతోంది. రోజూ ఆయన చేతివేళ్లు లెక్క పెట్టించి ఎన్ని ఉన్నాయని అడుగుతాడు. పూర్ణని చూడగానే "అమ్మా" అంటూ లేచొచ్చింది పాప. దాని చెయ్యి పట్టుకుని అంది పూర్ణ "మావయ్యగారూ వెళ్లొస్తాను. అన్నీ టేబిలు మీద పెట్టేను. పెరుగు కొంచెం పుల్లబడింది". ఆయన నవ్వి "వెళ్లిరా తల్లీ" అన్నాడు.

"నాన్నా నేను ఆఫీసు నుంచే మూడు గంటలకి ఇంటర్వ్యూకి వెళ్లొస్తా."

"అట్టాగే. ఫోన్ చెయ్యి. Don't worry" లేచి ఆయన వాళ్లు వరండాలో లిఫ్టు ఎక్కే వరకూ గుమ్మంలో నుంచుని తలుపు వేసుకుని వచ్చి మళ్లీ పేపర్లో కూచున్నాడు.

పాపని ఎత్తుకున్నాడు ఆది. అతని మొహంలోకి చూస్తూ ఆమె మాట్లాడుతూనే ఉంది. వీధి చివర స్కూలు బస్సు వచ్చి ఆగింది. తల్లీ కూతుళ్లు బస్సు ఎక్కేరు. వెనక్కి వెళ్లి స్కూటరు డబ్బాలోంచి సిగరెట్టు పెట్టె తీసి సిగరెట్టు వెలిగించి నుంచున్నాడు. మధ్యాహ్నం ఇంటర్వ్యూ. చీమకాలంత నమ్మకంగానీ ఆశగానీ లేదతనికి. ఒక రోజు సాయంత్రం టాంక్‌బండు మీంచి వస్తూ ఓ విగ్రహం దగ్గిర బైకు ఆపి ఆలోచించేడతను. అప్పుడు కూడా ఏదో ఇంటర్వ్యూకి వెళ్లి మామూలుగా మొహం మెడ చుట్టూ వేసుకుని వచ్చేడు. ఉద్యోగం ఎందుకు రావడం లేదు? ఇంటర్వ్యూ బాగా చెయ్యడం లేదనా? తెలిసిన వాళ్లెవరూ లేకపోవడం వల్లనా? కర్మకాలడం వల్లనా? తనకి మూడోదాని మీదే ఎక్కువ నమ్మకం. అమ్మ పోయి ఆరేళ్లయింది. నాన్న మొండి ధైర్యం తనకి రాలేదు. అప్పటికే అక్కకి పెళ్లయిపోయింది. నాన్న మనసులో ఏం పడ్డాడో గానీ అమ్మ పోయిన పదిహేను రోజులకల్లా తేరుకున్నట్టు కనిపించాడు. కానీ ఆయన తేరుకోలేదని తనకి తెలుసు. మంచం పక్కనే తలవేపు చిన్న బల్లమీద అమ్మ ఫోటో పెట్టుకున్నారాయన. ఈ L&T ఇంటర్వ్యూ తనకి వస్తుందనుకోలేదు.

సిగరెట్టు కాలికింద నలిపి దూరంగా పెట్టి బైకు తీశాడు ఆది. హెల్మెట్ పెట్టుకుని కూచోగానే కూరల బుట్టతో ఎదురుగా వచ్చింది రెడ్డిగారి కోడలు. ఎప్పటిలాగే నవ్వుతూ "ఆఫీసుకా?" అందామె. అతను ఎప్పటిలాగే నవ్వి తలూపేడు. తనకంటే పెద్దదామె. బాగానే ఉంటుంది. పూర్ణ అంత కాదు. వాళ్లాయన లావుగా ఉంటాడు. ఆయన్ని కూచోబెట్టుకున్న స్కూటరు కదలడం కష్టంగానే ఉ ంటుంది. ఆమె ఎందుకు నవ్వుతుంది? అక్కడ ఇంకెవరేనా ఉంటే ఆమె మాట్లాడదు. అంటే ఆ నవ్వుకి అర్థం ఏమిటి? ఎప్పుడు ఎదురుపడ్డా ఆ కూర్ల బుట్టతోనే ఎదురవుతుంది. ఎప్పుడేనా కూతుర్ని స్కూలికి పంపించి ఎదురుపడుతుంది. "ఆఫీసుకేనా?". అతనికి చాలాసార్లు అనిపించింది. "కాదండీ. అక్కడ టాంక్‌బండుమీద బైకు పెట్టి హుసేన్‌సాగర్‌లో దూకాలి. వస్తాను" అనాలనుంటుంది. అతనెప్పుడూ గేటు దాటింతరవాత ఆమె గురించి ఆలోచించలేదు. ఆమె గురించి ఆలోచించాలని

గానీ మాటలు కలపాలని గానీ అతనికెప్పుడూ అనిపించలేదు.

ఆదినారాయణ వెళ్లేసరికి పని ముమ్మరంగా సాగుతోంది. మల్టీప్లెక్సు అస్థిపంజరం వికారంగా ఉంది. రెండో అంతస్తులో కూడా నిర్మాణం పూర్తి కావొచ్చింది. కింద షాపింగ్ కాంప్లెక్సు, మూడో అంతస్తులో మరో థియేటరు. సగం కేంటీను. ఒక పెద్ద తెలుగు నటుడు, ఒక గుజరాతీ కలిసి నాగరీకమైన రెండు అవసరాలు ఈ రూపంలో తీరుస్తున్నారు. ఒకటి కాలక్షేపం, రెండు అనవసరమైన తిండి. థియేటరు ముందున్న ఖాళీస్థలం అంతా మెత్తటి దుప్పటిలాంటి గడ్డి పెంచి చిన్న పార్కులాగ తయారు చెయ్యాలని ఆది సీనియరు ఒప్పించాడు. తనకీ సీనియర్‌కీ మధ్యవాడు కన్నడిగుడు. పెద్దవాడు తనకంటే. మనిషి మంచివాడు. బాగా దగ్గిరికి వస్తే ఏదో ఆయుర్వేదం మందు వాసన వస్తుంది. బాగానే ఉంటుంది. కన్నడ తెలుగులో మాట్లాడతాడతను. సన్నగా తెల్లగా బలహీనంగా కనిపించినా శర్మ ఎప్పుడూ ఖాళీగా కూచోడం చూడలేదు. వాహనం షెడ్డులో పెట్టి మెట్లవేపు వెడుతుండగా ఎదురొచ్చేడు శర్మ. ఆదిని చూడగానే నవ్వి "నీ కోసమే నప్పా" అన్నాడతను. అప్పట్నించీ మధ్యాహ్నం వరకూ వేరే ఆలోచనతో పనిలేకుండా తిరిగే చక్రంలా పనిచేశాడతను. మధ్యలో ఇద్దరూ కింద ఆఫీసులో కూచుని టీ తాగుతూ కబుర్లు చెప్పుకున్నారు. సగం టీ తాగి ఆదివేపు నిశితంగా చూస్తూ అన్నాడు శర్మ. "న్యూస్ తెలిసిందా లేదా?"

"న్యూసేంది? నన్ను ఉద్యోగంలోంచి తీసేస్తున్నారా?"

శర్మ నవ్వేడు. "అదిగాదమ్మా. అందరికీ తెల్వదనుకో. నువ్వు విన్నావనుకుంటిని."

"నాకేం తెలీదు. పైగా నేనేం పట్టించుకోను. సాయంత్రం ఎప్పుడవుతందా అని చూస్తూంటా. రాత్రి, ఉదయం ఎప్పుడవుతుందా అనుకుంటా".

"నీకు చాలా frustration ఉందప్పా. ఇంకా చిన్నవాడు గదా నువ్వు".

"న్యూసేందో చెప్పలేదు"

ఆలోచిస్తూ, ఆదిని చూస్తూ అన్నాడు. "భూమారెడ్డిగారు షేరుహోల్డరవుతా ఉన్నాడు" ఆది నిర్లిప్తంగా ఏవీ అనకపోవడంతో మళ్లీ వివరించాడు శర్మ.

"భూమారెడ్డి ఎవరో తెల్సునా?"

"తెలీదు".

"పెద్ద కాంట్రాక్టరు. గత ఇరవై సమత్సరంలో ఎదిగి పోయినాడు. ఒచ్చే ఎలక్షన్లలో నిలబడతాడని అంటున్నారు".

"వ్యాపారం చేసే పెద్దవాళ్లందరూ రాజకీయాల్లోకి వస్తారు. వాళ్లకి అనుకూలంగా చట్టాలు, పాలసీలు మార్చుకుంటారు. ఏవుందిందులో? ఈ దేశం వాళ్లదే".

"సర్లే అప్పా. అదిగాదు. ఈ రెడ్డి సారు మన సినిమా హీరో షేరు కొన్నాడు".

ఈ సారి కొంచెం ఆశ్చర్యపోయాడు ఆది. "అదేవిటి?"

"అది ఏమీ లేదు. అది అట్లా వింటున్నాము. నిజం. మనకి కొద్ది రోజుల్లో రెడ్డిసారు బాసు అవబోతాడు. కంపెనీ పెద్ద అవుతుంది".

"మనం?"

"ఏమో. మనకి లాభం ఏముంటదప్పా?"

"కానీ మన సేటు మంచోడన్నా"

"నిజం. రియల్ ఎస్టేటులో అటువంటివాడు ఉండనే ఉండడు. పాపం పున్నెం తెలుసప్పా వానికి"

"కానీ రెడ్డిగారొస్తే మనకి బాసు ఎందుకవుతాడు?"

"ఆ సారు వస్తిరంటే అంతే. వాని గురించి నీకు తెల్వదప్పా".

"ఒట్టి యెదవన్న మాట".

"నో నో. మంచిగాడు, చెడుగాదప్పా. మనకి జీతం ఇస్తాడు. అంటే వస్తువు మాదిరి కొనుక్కుంటాడు. లేండు, ఇసక, సీమెంటు మాదిరి. దేని వేల్యూ దానికి కడతాడు. నీకు నచ్చలేదు, ఎల్లిపోవాల్సిందే. పనికి జీతం..."

"అదేలే. అర్థం అయింది. వాళ్లందరూ అంతే బాస్. డబ్బు సంపాదించి దాన్ని కాపాడుకోడానికి అసెంబ్లీ, పార్లమెంటు సీటు కొనుక్కుంటారు. తరవాత మినిస్ట్రీ కొనుక్కుంటారు. ఇదంతా మామూలే గదన్నా".

"I agree. నాకు రెండుమూడు సమత్సరం పని చెయ్యాలని ఉంది. అంతే. ఆరామ్‌సే ఘర్‌మే బైటేంగే. బస్. ఏమి, నీ ఫ్యూచర్ గురించి ఆలోచించినవా?"

"ఆలోచిస్తున్నాను".

"మరి ఏమి డిసెషన్ చేసినావు?"

"ఏ డెసిషనూ చెయ్యలేనని తెలిసింది".

"ఏమప్పా, ఏమి చెప్తా ఉన్నావు?"

"అవును బాస్. నా ఫేమిలీ గురించి మీకు తెలుసు. నాన్నకి పెన్షన్ వస్తుంది. ఆయన మందులూ అవీ ఆయనే కొనుక్కుంటారు. మా ఆవిడ ఎప్పుడేనా వద్దన్నా వినదు. పైగా ప్రతి నెలా ఎంతో కొంత ఇంటి ఖర్చులకని ఇస్తూంటాడు. మనవరాలికి ఏవేవో కొంటూంటాడు. నడుస్తానే ఉంది. ఇంజనీరింగ్ చెయ్యకుండా పాన్ డబ్బా పెట్టుకున్నా బోలెడు పైసలు. అవునా కాదా?"

"అంత frustration మంచి కాదప్పా. బాధ ఉండొచ్చు. కాదన్ను. తట్టుకోవాల. బాధ లేకుండ ఎవరున్నరప్పా! ఏమి!"

" Frustration ఉండదా? ఎన్ని ఉద్యోగాలు try చేశాను. ఒకటీ రాలే. మా ఆవిడ మంచిది గనక సరిపోయింది". శర్మ ఉన్నట్టుండి నవ్వేడు.

"నీవు పెండ్లికి ముందు ప్రైమినిస్టరు కొడుకునని చెప్పినావా?" ఈ సారి ఇద్దరూ నవ్వేరు. కళ్లజోళ్లొంచి ఆదిని చూస్తూ భుజం మీద చెయ్యి వేసి అన్నాడతను.

"Don't worry. ఎన్ని గంటలకి పోవాల?"

"మూడున్నరకి ఇంటర్వ్యూ".

"గుడ్‌లక్. అంతా రాగవేంద్ర స్వామి దయ. పోయిరాప్పా".

"ఏమో గానీ, ఇంటర్వ్యూకి పోవాలని లేదు. పెట్రోలు దండగ"

"మంచివాడుగున్నవయ్యా. ఇంటర్వ్యూకి పోకపోతే ఉద్యోగం ఇస్తారా? పోయిరా. wait for good days"

"మీకు జాతకం తెలుసా?"

"దీనికి హారోస్కోప్ దేనికప్పా? లైఫు experience చాలు. సరిగానీ నీవు త్రీవో క్లాక్‌కి

అంతా బయల్దేరు. నే జూసుకుంటలే. అక్కడ అయిపోంగనే వచ్చెయ్యి. ఏమి?"

ఆది వాచీ చూసుకున్నాడు. ఇద్దరూ లేచేరు. బయటికి వస్తూండగా మేస్త్రీ ఎదురు పడ్డాడు. అతని వెనక సేటుగారి తెల్ల ఇనోవా లోపలికి వచ్చి ఓ చుట్టు తిరిగి ఆగింది. ఇద్దరూ పరుగులాంటి నడకతో కారు దగ్గిరికి వెళ్లేరు. "ఇప్పుడు రావడమే మంచిది" అన్నాడు శర్మ. తల ఊపేడు ఆది. మూడు దాటేవరకూ సేటుగారు ఉండిపోతే బాగుండుననుకున్నాడు ఆది. లోపల్నించి నాలుగు కుర్చీలు వచ్చేయి. మేస్త్రీ దూరంగా వెళ్ళి పోయాడు. నాలుగూ ప్లాస్టిక్ కుర్చీలే అయినా సేటుగారిది ప్రత్యేకం. సగం పడక కుర్చీలాగ ఉంటుంది. కుర్చీకి నిండుగా తెల్లగా వెడల్పుగా కూచున్నాడు సేటు. ఒక్క చూపుడు వేలుకి మాత్రం ఉంగరం మెరుస్తోంది. ఆయనకి టీ తెచ్చేలోగా మరో ముగ్గురు మేస్త్రీలు వచ్చేరు. తోలు సంచీలోంచి కాయితాలు బయటికి తీశాడాయన. అరగంట తరవాత ఆది నిరుత్సాహంగా నిట్టూర్చేడు. సేటుగారు లేచి ఎదురుగా పెరుగుతున్న సిమెంటు అస్థిపంజరాన్ని ఓసారి చూసి, ఆ కళ్లతో అందర్నీ చూసి తల ఊపుతూ కారువేపు నడిచాడు. సేటుగారు వెళ్లగానే అన్నాడు ఆది.

"అన్నా, నేను గోడౌను దగ్గిరికెళ్ళి అక్కణ్నించి అక్కడికి వెళ్లొస్తా".

"మంచిది. పోయిరా. గోడౌను దగ్గిర శ్రీధరుంటాడు. వేగం రమ్మని చెప్పు"

బైకు బయటికి తీశాడు ఆది. గోడౌను అక్కడికి నాలుగు కిలోమీటర్లు. బస్సులు, కార్లు, ఆటోలు, మనుషులు కలిసిపోయిన రంగురంగుల చిక్కటి జావలాగ కారుతోంది ట్రాఫిక్. అందులోంచి దూసుకుంటూ సరిగ్గా మెట్లమీద నుంచున్న శ్రీధర్ దగ్గిర ఆగేడు ఆది. హెల్మెట్ తీసి, కాయితాలిచ్చి శర్మగారు రమ్మన్నారని చెప్పి బయలుదేరేడు ఆది. "ఏమర్జంటా. కూచుని పోబ్బా".

"లేదు బాస్. పనుంది. దూరం పోవాలి. వచ్చి చెప్తాలే" చెయ్యి ఊపి బైకు అదిలించి బయల్దేరేడు ఆది.

ఫైలు తీసుకుని మూడో అంతస్తుకి ఎగిరేడు ఆది. హాల్లోకి అడుగు పెట్టగానే అతనికి వెనక్కి వెళ్లిపోవాలనిపించింది. కుర్రాళ్లు, అమ్మాయిలు బృందాలుగా విడిపోయి కబుర్లు పోసుకుంటున్నారు. చాలామంది కొత్తగా యూనివర్సిటీ చర్మాన్ని దుల్పుకుని మెరిసిపోతున్నారు. కుర్చీలో కూచుని చేతిలో ఫైలు వేపూ, నేల వేపూ, మిగతా వాళ్లవేపూ చూస్తూ, మధ్యలో పక్క వాళ్లతో మాట్లాడుతున్న ఆదినారాయణమూర్తుల్ని చూస్తుండిపోయాడతను. వీళ్ల మొహాలు మెరిసిపోడం లేదు. నవ్వు తుళ్లడం లేదు. అసంకల్పితంగా దూరంగా కూచున్న ఆ ఇంజనీరు దాయాదులతో ఆదికి స్నేహం వంటి సానుభూతి ఏర్పడింది. "మనందరం మరో గంటలో నిశ్శబ్దంగా, కొంచెం మెల్లిగా నడుచుకుంటూ బైటికి వెళ్లిపోయి వెంటనే ఇంటికెళ్లడం ఇష్టంలేక 2/5 టీలు తాగుతూ కూచుంటాం". అనుకోగానే నవ్వొచ్చిందతనికి. ఎందుకు వీళ్లని పిలవడం? ఎంతమంది పనికిరారో చెప్పడానికా? మనకి ఎంత తక్కువ తెలుసో నిర్ధారించడానికా? కాసేపు ఇంటర్వ్యూల గురించి ఆలోచించాడతను. వాక్యాల తేడాతో కాసేపట్లో ఏవడుగుతారో తనకి తెలుసు ("okay, thank you. you will be informed. good luck"). తన సహాధ్యాయులు చాలా మంది చిన్న ఉద్యోగాలే చేస్తున్నారు. కొంతమంది బేంకుల్లో చేరేరు. తనకి బేంకు ఉద్యోగంలో చేరాలని ఎందుకు అనిపించలేదు?. రెండు మూడుసార్లు నాన్న హెచ్చరికలు కూడా చేశాడు. మరి? బేంకులు నచ్చకా? తనకి ప్రత్యేకంగా నచ్చకపోవడం ఉండదు. నాన్న గుర్తు రాగానే అతనికి ఇబ్బంది అనిపించింది. నిజానికి ఆయన ఏవీ అనడు ("సర్లే. నువ్వేం ఫీలవ్వాల్సిన పన్లేదు"). కాసేపు ఇంజనీరింగు

చదువు గురించీ, ఉద్యోగాలు ఎందుకు రావడం లేదో, పరిస్థితి ఎందుకిలా ఉందో చెప్తాడాయన. పొడగరి ఆయన. లావు కాదు గానీ బొద్దుగానే ఉంటాడు. కుర్చీలో కాలుమీద కాలు వేసుకుని కుడిపాదం మెల్లిగా ఆడిస్తూ మాట్లాడ్డం అలవాటు ఆయనకి. అలా ఆయన మాట్లాడుతున్నప్పుడు కదుల్తోన్న ఆయన పాదం ఆదిని చిత్రమైన కలవరానికి గురి చేస్తూంటుంది. శరీరంతో సంబంధంలేని ఏదో ప్రత్యేక చైతన్యం దాన్ని కదిలిస్తున్నట్టూ అట్లా చలిస్తూ తనని చిక్కు ముళ్ళు వేస్తున్నట్టూ అనిపిస్తుంది. ఒక ఆధిక్యం ప్రశ్నిస్తున్నట్టుంటుంది. ఆది ఒక్కడే గదిలో కూచున్నప్పుడు అనేక సార్లు ప్రయత్నించాడు. పాదం కదిల్తే మాట రాలేదు. మాట్లాడితే పాదం సరిగ్గా కదలడం లేదు. పోనీ ఉత్తినే పాదాన్ని కదిలిస్తూ కూచుందావని చూశాడు ఆది. కాసేపు కదిలి ఆగిపోయింది. అతని కేం నచ్చలేదు.

కోపరేటివు బేంకులో సెక్రటరీగా చేసి రిటైరయ్యాడాయన. బేంకు రాజకీయాలు బాగా తెలుసాయనకి. ఆదివారం భోజనాలు చేసేటప్పుడు అప్పుడప్పుడు కథలు కథలుగా చెప్పడం అల వాటు ఆయనకి. కుర్చీలో కూచున్నా, నడుస్తున్నా, నుంచున్నా, మాట్లాడుతున్నా, మాట్లాడకపోయినా నిండుగా బలంగా కనిపిస్తాడాయన.

“Mr.K.ఆదినారాయణ మూర్తి”. చటుక్కున L&T హాల్లో పడ్డాడు ఆది. తేరుకుని, కాలరు సద్దుకుని సగం తీసిన తలుపులోంచి చల్లదనంలోకి, మార్చ్యురీలోకి నడిచినట్టు అడుగు పెట్టేడతను. పదమూడు నిముషాల తరవాత సికింద్రాబాద్ వేడి ట్రాఫిక్‌లో కారుతూ సైటు దగ్గిరికి వెళ్లేడు ఆది. శ్రీధర్, శర్మ, ముగ్గురు మేస్త్రీలు మాట్లాడుకుంటున్నారు. శర్మ అధిక భాగం వింటూ తలూపుతున్నాడు. బైకు ఆపి మెల్లిగా నడుచుకుంటూ వాళ్ల దగ్గిరికి వెళ్లేడు ఆది. దగ్గిరికి రాగానే ప్రశ్నార్థకంగా చూశాడు శర్మ. “అప్పుడేనా?” అన్నాడు ఆది. తలూపి సంభాషణలో దూరేడు శర్మ.

ఆరున్నరైంది. శర్మ వెళ్లిపోయాడు. మేస్త్రీలు స్టోరు గది తాళాలు వేసి సెక్యూరిటీకి ఇచ్చి వెళ్లిపోయారు. పనివాళ్లు ఎప్పుడో వెళ్లిపోయారు. “ఏందాలోచిస్తున్నావు?” అన్నాడు శ్రీధర్. ఓ పొడవాటి నిట్టూర్పు విడిచి “ఏవీ లేదు” అన్నాడతను.

“నీకు ఎన్నిసార్లు చెప్పేను? బుర్ర చెడగొట్టుకుని చేసేదేవుంది? ధైర్యంగా ఉండు గురూ. ఉద్యోగం రాలేదని ఏడుస్తూ కూచుంటావా ఏంది? ఇవన్నీ నేనూ పడ్డా. నాకు తెలవదనుకోకు. ఇలాగే బాధపడతా కూచున్నావనుకో, ఏం జరుగుద్దో తెలుసా? నీ మీద నీకే జాలి కలుగుద్ది. ఎందుకూ పనికి రాకుండా పోతావు. ఏదో ఒక  నమ్మకంతో బతకడం నేర్చుకోవాలి”.

“ఇప్పుడు నేను ఏడుస్తూ కూచున్నానా?”

“ఏడుపంటే బోరున ఏడవడం గాదు. ఎవడికీ తెలీకుండా ఏడుచుకోడం. నీ  సంగతి నాకు తెలవదా? సరే పా. ఓసారి బాత్రూంకెళ్లి మొహం కడుక్కురా చెప్తా”.

“ముందు చెప్పు. మొహం ఎందుకు కడగడం? ఎప్పుడూ మన ఫేసు ఒకటే”.

“నీ యవ్వ ఫేసు మారుద్దనిగాదు. ఫేసు మీద expression మారుద్దని”

“తరవాత?”

“తరవాత రూం కెళ్లి ప్రశాంతంగా బీరు తాగుదాం”.

“తప్పదా?”

“ఏం ఇంటికి అర్జంటుగా పోవాల్నా?”

“లేదులే. okay ఒక్క క్షణం”.

ఆఫీసు బాత్రూంలోకి వెళ్లి లైటు వెయ్యగానే అద్దంలో ఎదురు పడ్డాడు ఆది. చూసుకున్నాడతను. మొహం శుభ్రంగా కడుక్కుని, రుమాలుతో తుడుచుకుని అద్దంలోకి చూశాడు. కాస్త శుభ్రంగా కనిపించాడు ఆది. పూర్ణ తనకోసం ఎదురు చూస్తూంటుంది. తన దగ్గిర్నించి ఫోను వస్తుందనుకోదు. తెలుసు ఆమెకి. ఇద్దరికీ తెలుసు. ఈ రకమైన తెలీడం ఇద్దరి మధ్యా అలవాటయి పోయింది. ఆదికి అదే ఇబ్బందిగా ఉంటుంది. నాన్న మరీను. అసలు ఇంటర్వ్యూలు రాకుండా ఉంటే ఎంత సుఖంగా ఉంటుంది? ఎందుకవి? ఏదో ఉంటున్నాడు గదా! ఇంక ఇలాగాదు. ఓకే అనుకుని బయటికి నడిచాడు ఆది. "చల్' అంటూ అతని బైకు స్టార్టు చేశాడు శ్రీధర్. ఒకళ్ల వెనక ఒకళ్లు గేటు దాటుతూండగా ఇద్దరి వీపులకీ సెల్యూట్ కొట్టేడు సెక్యూరిటీ.

తళతళలాడుతున్న లైట్ల వాగులోంచి, వేడిగాల్లోంచి శ్రీధర్ గది దగ్గిరికి చేరేరిద్దరూ. రెండస్తుల మధ్య తరగతి సంసారాలు. కింద ఎప్పుడో ఎందుకో యజమాని కట్టుకున్న గది. పిల్లలెవరో ఆడుకుంటున్నారు. 'రమా. ఇంక చాలు. ఒచ్చి హోం వర్కు చేసుకో. డాడీ ఒస్తే తిడతారు". ఆట ఆగిపోయింది. మొహం కడుక్కుని లుంగీ చుట్టబెట్టుకుని ఫ్రిజ్ లోంచి రెండు బీరు సీసాలు తీశాడు శ్రీధర్, టీపాయి జరిపి రెండు గ్లాసులు పెట్టేడు ఆది. "మంచి నీళ్ల నల్లా ఆగుతుందేమోగానీ నీ బీరు సప్లయి ఆగదు. బలేవాడు దొరికేడు బాస్" అన్నాడు ఆది. బీరు మూతలు తీసి నురగ రాకుండా రెండు గ్లాసులూ నింపుతూ అన్నాడు శ్రీధర్. "వాడు కమర్షియల్ taxes లో ఉండడం నా అదృష్టం. వాడున్నంత కాలం మన సప్లయి ఆగదు". బీరు గుక్క తీసుకుని "ఒచ్చే వారం మంచి విస్కీ వస్తుంది. శర్మని గూడా పిలుద్దాం. ఇంట్లో ఏదో చెప్పి రాత్రికి ఉండిపో" అన్నాడతను.

"ఏదో ఏం కర్మ. నేను ఎనిమిది దాటి కొంప చేరితే మా ఆవిడకి తెలిసిపోతుంది. ఇంక రాత్రి ఉండి పోతానంటే హనుమాన్ చాలీసా చదువుకుంటాననుకోదు".

"నువ్వు లక్కీ గురూ".

"ఆహా. నేను గూడా జాగ్రత్తగానే ఉంటాగదా".

"నీకు మీ ఫాదర్ భయం. అవునా?"

"ఏవీ అనరు. నాకే బాగోదు".

"Okay. శర్మగార్ని పిలుద్దాం". ఆది నవ్వేడు. శ్రీధర్ కూడా నవ్వుతూ అన్నాడు. "గుక్క లోపల పడగానే యమ్మ కన్నడ పాటలు పాడతాడు బాసు. మంచోడు".

ఇద్దరూ నవ్వుకుని సగం గ్లాసులు ఖాళీ చేసి సిగరెట్లు వెలిగించారు. శ్రీధర్ అన్నాడు.

"మూర్తీ, రెడ్డిగారి గురించి విన్నావా?"

"శర్మ చెప్పేడు"

"ఆడు మోడ్రన్ జమీందారు. ఆల్వాల్‌లో థియేటరు. విజయవాడలో హోటలు. హైదరాబాదు కొనుక్కోడానికి రెడీగా ఉన్నాడు".

"రాజకీయాల్లోకి దిగాలింక".

"ముండల్ని ఉంచుకున్నట్టు వీళ్లు ఎమ్మెల్యేల్ని ఉంచుకుంటారు. ఇంక వాడెందుకు నిలబడేది? ఏమోలే, చెప్పలేం. నా కొడుకులికి ఏణ్నించి ఒస్తాయి బాసూ పైసలు?"

"వాడెవడో చెప్పేడుగా. మొదటి లక్ష నువ్వు సంపాయిస్తే అదే మిగతా లక్షలు సంపాయిస్తుంది".

"బొక్క"

"మన నెత్తిన ఎక్కడు గదా?"

"లేదు. వాడంత రిమోట్ కంట్రోల్ అన్నారు శర్మగారు"

"రక్షించాడు. రెడ్డిగారు సినిమాల జోలికి పోలేదా?"

"ఈ రోజుల్లో మెడకాయమీద తలకాయున్నోడెవడూ సినిమా జోలికి పోడు. ఏది హిట్టో ఏది ఫట్టో ఒక్క నా కొడుకుని చెప్పమను" ఆది నవ్వేడు.

"రెడ్డిగారి పిల్లలేం చేస్తారు?" శ్రీధర్ మళ్లీ గ్లాసులు నింపి అన్నాడు.

"ఇద్దరాడ పిల్లలు ఆస్ట్రేలియాలో. కొడుకు అమెరికా. ఈయనిక్కడ".

"అంతేనా?"

"ఆయన చెల్లెలు ఒకత్తె ఇక్కడే ఉంటుంది"

"మొగుడు రియల్ ఎస్టేటా?"

"శర్మగారి న్యూస్‌ఛానెల్ ప్రకారం ఆవిడకి మొగుళ్లేడు. ఆల్వాల్‌లోనే మంచి బొటీక్ ఉందంట. బాగుంటదంటలే".

"ఆవిడా బొటీకా?"

"ఆమె సంగతి తెలీదు".

"అదీ అడుగు".

నవ్వి అన్నాడు శ్రీధర్. "మూడ్ మారిందా ఇప్పుడు?"

"నాకు నాన్న, పూర్ణ బాధ పడతారని బాధ గురూ..."

"నిజమే. ఏం నీకేం బాధలేదా?"

"లేదని గాదు...ఏందంటే, ఏదో ఉందిగా. మంచి జాబ్ రావాలని అందరికీ ఉంటుంది. కానీ ఏందంటే...మరేం చెయ్యాలి? నా trials నేను చేస్తన్నా గదా? నడుస్తా ఉంది గద. నీకు ఎట్ల చెప్పాలి? నీకు అర్థమైంది గదా? పూర్ణకి ఏందంటే తొరగా మంచి ఉద్యోగం రావాలి, కాస్త పైసలు ఎక్కువుంటే బావుంటుంది గదా అని. నిజవే అనుకో. సరె, చూద్దాం. నువ్వన్నట్టు ఊరికే వర్రీ పడ్డం అనవసరం. అసలేం లేదనుకో, అప్పుడు..."

మరో అరగంట కూచుని బయల్దేరేడు ఆది. బైకు బయల్దేరిన తరవాత లోపలికి వెళ్లిపోయాడు శ్రీధర్. అలవాటుగా, యాంత్రికంగా బైకు ఆదిని ఇల్లు చేర్చింది. తాతగారి ఒళ్లో కూచుని టీవీ చూస్తూ కునికిపాట్లు పడుతోంది పాప. ఆయన టీవీ చూస్తున్నాడో, మధ్యలో మనవరాలి మాటలు వింటున్నాడో ఆయనకే తెలియాలి. ఆదిని చూడగానే ఒక్క గెంతులో 'నాన్నా' అంటూ వచ్చింది. దాన్ని ఎత్తుకుని ప్రశ్నార్థకంగా చూస్తున్న తండ్రి వేపు చూస్తూ అన్నాడతను. "ఇంటర్వ్యూ చాలా బాగా అయింది. I am happy. తరవాత ఇన్‌ఫామ్ చేస్తానన్నారు. చాలా మందే ఉన్నారు. అయితే నా experience బాగుంది".

"ఉంటారు. ఏటా ఇంజనీర్లని దేశం మీదికి తోల్తున్నారు గదా. సర్లే. వెళ్లి భోంచెయ్యి. నువ్విలా రావే. నాన్న అన్నం తినొస్తాడు".

ఆది మీంచి జారుతూ తాతగారి దగ్గిరికి వెళ్లింది పాప. గదిలో కుర్చీలో కూచుని ఒళ్ళో పేడ్ పెట్టుకుని నోట్స్ రాసుకుంటోంది పూర్ణ. ఈ మధ్య అప్పుడప్పుడు రాత్రి రాసేటప్పుడు, చదివేటప్పుడు కళ్లజోడు పెట్టుకుంటోంది పూర్ణ. *("కళ్లజోళ్లో ఇంకా బావుంటావు")*. చొక్కా తీసి హేంగరికి

తగిలించి ఆమె దగ్గిరికి నడిచాడు.

"ఊ. ఎన్ని బీర్లు?". నవ్వి అన్నాడతను.

"చెరోటి". తలెత్తి కళ్లజోడు తీస్తూ అందామె.

"ఏవిటి విశేషాలు?". ఆమెకి కావలసిన విశేషం తనకి తెలుసు.

"ఇంటర్వ్యూ బాగా జరిగింది. చాలాసేపు కూచోపెట్టేరు. నా work experience నచ్చింది వాళ్లకి".

"ఓ good luck. I am happy".

అతను ఆమె పక్కనే కూచున్నాడు.

"చాలుగానీ, వెళ్లి స్నానం చేసిరా బీరు కంపు కొడుతున్నావు" అతను ఆమె భుజం మీద తల ఆనించాడు.

"మాకు కొత్త బాసు ఒచ్చేడు".

"అంటే?".

"మా కంపెనీ భూమారెడ్డిగారి చేతుల్లోకి పోయింది. ఆయనే మా కొత్త బాసు"

"భూమారెడ్డి అంటే ఎవరు?"

"మన నగరాల్ని మిరపకాయబజ్జీల్లా తినేవాళ్లలో ఒకడు. చాలా పెద్దోడు".

"ఓ. అందరూ అంతే". అతను లేచి స్నానాల గదిలోకి వెళ్లేడు.

ఆది తీరిగ్గా స్నానం చేసి వచ్చేసరికి పాప ఓ పక్కమీద పడుకుని నిద్రలో ఉంది. రోజూ అంతే. ఆది భోజనం చేస్తున్నప్పుడు తాతగారి ఒళ్లోనో, తన ఒళ్లోనో కూచుని జోగుతుంది. లుంగీ చుట్టుకుని బనీను తగిలించుకుంటూ పూర్ణ దగ్గిరికి  వెళ్లేడు ఆది. ఆమె లేచి "పద" అంది. రెండడుగులు వెయ్యగానే ఆమెని దగ్గిరికి తీసుకున్నాడు.

"నువ్వే కాదు. మా కొలీగ్సు బోలెడు మంది బీరు తాగుతారు" అందామె.

"అదేం గొప్పని నేను చెప్తేగదా. నువ్వు తాగమంటే తాగవు"

"నాకు నచ్చదది. పద, మావయ్యగారు wait చేస్తుంటారు."

పెద్దాయన ఏదో సినిమా చూస్తున్నాడు. వీళ్లద్దరూ డైనింగ్ టేబిల్ దగ్గిర కూచున్నారు. ఆమె అతనికి వడ్డిస్తోంది.

"ఈ సినిమాలు ఏం బావోడం లేదమ్మాయి." అన్నాడాయన. పూర్ణ నవ్వింది.

"మీకు బాగోవు మావయ్యగారు. జనం చూస్తూనే ఉన్నారు."

"ఈ కొట్టుకోడం ఏందిరా?"

"నాన్నా అలా కొట్టుకోందే, ఫారిన్‌లో పాటలు పాడుకోందే సినిమాలు ఎవడు చూస్తాడు?"

"అయినా ఒకణ్ని కొడితే నలుగురు గాల్లోకి ఎగిరిపడుతున్నారు".

భార్యాభర్తలిద్దరూ నవ్వేరు. మరో పది నిముషాలు హింస భరించి టీ.వీ ఆపేసి "ఒరేయి. నేను కాసేపు చదువుకుని పడుకుంటాను."

అని లేచి గదిలోకి వెళ్లిపోయాడాయన.

"మీ కొత్త బాసు ఏవంటున్నాడు?"

"ఏదీ ఇంకా. అప్పుడే తెలీదు" అంటూ భూమారెడ్డిగారి సంక్షిప్త జీవిత చరిత్ర చెప్పేడు ఆది.

అమె ఏవీ అనలేదు.భోజనం ముగించి లేచేడతను. కంచాలు తీసి ఆమె సింకులో వేసింది. పెరుగు గిన్నె తీసి ఫ్రిజ్‌లో పెట్టేడతను. స్పాంజి తీసుకుని టేబిలు శుభ్రంగా తుడిచి మళ్లీ చెయ్యి కడుక్కుని ఒచ్చి టీవీ ఎదురుగా కూచున్నాడు ఆది. డైనింగ్ టేబిలు దగ్గర లైటు తీసి పూర్ణ వచ్చి అతని పక్కనే కూచుంది. కూచూంటూనే మావగారి గది వేపు చూసిందామె. దగ్గరిగా వేసి ఉంది. *("నాన్నా మీరు లోపల గడియపెట్టుకోకండి")*. ఆది ఛానెళ్లు తిప్పుతున్నాడు.

"మావయ్యగారికి ఏదో చిన్న ప్రాబ్లం ఉన్నట్టుంది. చెప్పడం లేదు."

"అదేవిటి, బాగానే ఉన్నారుగా? ఏం, మందులు వేసుగోడం లేదా?"

"అదేంకాదు. నాకూ సరిగా తెలీదు. నాతో ఏవీ అనలేదు."

"మరి బాలేదని ఎట్లా తెలుసు?"

"ఒకటి. నేను గమనిస్తూంటాను. నువ్వు ఏవీ చూడవు. పైగా ఈవెనింగ్ రామ్మూర్తిగారు అనుకుంటాను ఫోన్ చేశారు. నేను డైనింగ్ టేబిలు దగ్గర కూరలు తరుగుతున్నాను. ఆయన్తో అంటూంటే విన్నాను."

"అదే ఏవన్నారు?"

"ఈ మధ్య బాగోడం లేదు, అని ఏదో అన్నారు. నేను వింటాననో ఏమో మెల్లిగా మాట్లాడేరు. వెంటనే అడిగితే బాగోదుగదా. నీకు చెబుదావని."

"పోనీ అడిగిరానా?"

"ఇప్పుడా? ఒద్దు. నేను చెప్పేననుకుంటారు."

"తప్పేవుంది?"

"తప్పని కాదు, ఒద్దు. రేపుదయం కాఫీ ఇచ్చి మెల్లిగా అడగు" తలఊపుతూ అన్నాడతను.

"ఇన్నాళ్ళూ బాగానే ఉన్నాడు...పెద్ద ఇబ్బంది లేదు...Health విషయంలో జాగ్రత్తగానే ఉంటారు".

"నాకూ అదే అనిపిస్తోంది. ఇన్నాళ్లూ పెద్ద ఇబ్బంది లేకండా జరిగిపోయింది. ఆయనకి మొహమాటం ఎక్కువ ఆదీ. నువ్వే జాగ్రత్తగా అడిగి తెలుసుకో. తరవాత మళ్లీ..."

"అడుగుతాను. నా దగ్గిర మొగమాటం ఏవుంటుంది?"

పూర్ణ అతని వేపు చూసి నవ్వి ఊరుకుంది. టీవీ చూస్తూ కబుర్లలో పడ్డాడతను. ఆమె సరిగ్గా వినడం లేదని అతను గమనించలేదు. వాళ్లు లేచేసరికి పెద్దాయన గదిలో లైటు లేదు. "చల్" అన్నా డతను. లోపలికి వెళ్లి మంచం మీద పడుకుంటూ కూతుర్ని చూశాడు. "ఇది పుస్తకంలా పడుకుంటుంది. అటూ ఇటూ కదలదు" అన్నాడు. నవ్విందామె. "నీ పోలికే వచ్చింది". బెడ్‌లైటు వేసి వచ్చి పక్కనే పడుకుంది పూర్ణ. ఆమె ఛాతీమీద తలపెట్టుకుని "ఇది చాలా సేఫ్ ప్లేస్. హాయిగా ఉంటుంది. No worry" అన్నాడు. అతని తలమీద చెయ్యి పెట్టిందామె. ఆమె ఆలోచనలు పక్క గదిలో ఉన్నాయి. ఆమె చెయ్యి అలా పెడితే అతనికి బావుంటుంది. సుఖంగా ఉ ంటుంది.

పూర్ణని చూడక ముందు అతనికి పెళ్లి మీద ధ్యాస లేదు. మంచి ఉద్యోగం వెతుక్కునే పనిలో ఉండేవాడు. అతని గమ్యం అది. ఫోటోలో బాగుందామె. కానీ పెళ్లి ఇష్టంలేదు. కానీ పెళ్లికూతురు బాగున్నప్పుడు నిరాకరించడం ఎంత కష్టమో అతనికి క్రమంగా తెలిసి వచ్చింది.

*("బంగారంలాంటి పిల్ల. మంచి కుటుంబం. ఆ తరవాత నీ ఇష్టం").* ఆమె బాగుండడం అతని ఓటమికి దారి తీసింది. ఆమెకి తెలీకుండానే, కలుసుకోకుండానే కలరు ఫోటో ద్వారా జయించింది. 'మంచి పిల్ల', 'మంచి కుటుంబం' అనే రెండు ఆయుధాలు ఆమెకి తోడయ్యాయి. తురుపు ముక్కలాగ ఉద్యోగం ఒకటి. "నీకు ఉద్యోగం ఉందిగా. మంచి ఉద్యోగం తరవాత వస్తుంది" అన్నాడు మేనమామ. నాన్నగారు నిశ్శబ్దంగా ఒత్తిడి పెంచేదు. మొత్తానికి పెళ్లి చూపుల వరకూ అంగీకరించాడు ఆది. నిరాడంబరంగా ఉన్న ఆ ఇంట్లో పూర్ణ సంతోషం పువ్వులా ఉంది. అతని వేపు సూటిగా చూసి "St, Annes College లో" అందామె. తరవాతగానీ బాగున్న అమ్మాయిల విషయంలో పెళ్లి చూపుల వరకూ ఎందుకు వెళ్లకూడదో అతనికి అర్థం కాలేదు. డాక్టర్లు 48 గంటల వరకూ ఏవీ చెప్పలేమన్నట్టు, రెండు రోజులు ఆగి మేనమామ ఒచ్చి "ఏరా, వాళ్లకి సరేనని ఫోన్ చెయ్యనా?" అన్నాడు. నిస్సహాయంగా ఆయనవేపు చూశాడతను. తలకూడా ఊపేడు. నాన్నగారు నవ్వేరు. మంచి స్కూల్లో టీచరుగా చేస్తూ మంచి ఉద్యోగంలేని తనని ఎందుకు చేసుకుంటున్నట్టు? అనుకున్నాడు ఆది. బలవంతంగాని చేశారా? ఆమె గురించి తనకంతా తెలీదు గదా. అయినా ఇప్పుడు చేసేదేవుంది? మావయ్యని అడిగితే మళ్లీ నోరెత్తకుండా ఏదో సమాధానం చెప్తాడు. okay fine.

పెళ్లి కొన్ని రోజులుందనగా ఓ రోజు సాయంత్రం ఆఫీసులో ఉండగా ఆది సెల్ మోగింది. "నేను పూర్ణ. బిజీగా ఉన్నారా?"

"ఆ, అదే. ఎప్పుడూ ఉండేదే".

"ఏం లేదు. ఇక్కడ మా కొలీగ్ ఇంటికొచ్చి వెళ్తుంటే మీ ఆఫీసు ఇక్కడే గదా అని గుర్తొచ్చింది. మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నానా?"

"అబ్బే. అదేం లేదు. అంటే, మీ రెక్కడున్నారు?"

"ఇక్కడే కామత్ ఉంది గదా, అక్కడ".

"Okay అక్కడే ఉండండి. నేను వస్తున్నాను"

నీలం రంగు చుడిదార్‌లో ఆమె గ్రామ్‌ఫోను పువ్వులా కామత్ ముందు నుంచుని ఉంది. గుర్తించి బైకు ఆపేడతను.

"రండి కాస్త చాయ్ తాగుదాం" అన్నాడతను.

"మీకేం ఇబ్బంది లేదుగా?"

"నో నో"

ఇద్దరూ చాయ్ తాగుతూ కబుర్లు చప్పరించుకుంటూ కూచున్నారు. ఆది కుటుంబ చరిత్ర అంతా సన్నితంగా తెలుసుకుందామె. దరిదాపు రెండు నెలల తరవాతగానీ అక్కడికి తుపాకీ పేల్చినంత దూరంలో పూర్ణ కొలీగ్‌గానీ, ఆమె బంధువులు గానీ లేరని తెలీలేదతనికి. ("ఏం చెయ్యను? నువ్వు ఫోన్ కూడా చెయ్యవు"). పెళ్లయిన తరవాత ఇద్దరూ మైసూరు వెళ్లేరు. బయటికి వెల్దామని బయల్దేరగానే వర్షం మొదలైంది. "ఆటో పిలు పోదాం". అందామె. "వర్షంలోనా?" "ఏం నడిచి వెళ్లం గదా? పైగా బయల్దేరాంగా. మనిష్టం" "నీ ఇష్టం. కానీ తడుస్తాం". ఎంత సేపు చూసినా ఆటో దొరక లేదు. కాసేపు చూసి ఇద్దరూ మళ్లీ గదిలోకి వచ్చేశారు. కిటికీలోంచి వర్షాన్ని చూస్తూ అతని భుజం మీద తల ఆనించి కూచుందామె. "నీకో మాట చెప్పనా?" అన్నాడతను.

"దేని గురించి"

"మన పెళ్లి గురించి"

"నాకు తెలుసులే"

"నీకెలా తెలుసు? నేను చెప్పేనా?"

"I can guess"

"సరే. చెప్పు చూద్దాం".

"okay పొరపాటు పడొచ్చు కానీ...నీకు మొదట పెళ్లి ఇష్టం లేదు. అవునా?" దిమ్మెర పోయాడతను. "నీకెలా తెలుసు?"

"తెలీదు. పెళ్లిచూపుల రోజు నీ మొహం చూసి అనుకున్నాను".

"ఏం, ఎలా ఉన్నాను?"

"అప్పుడే ఏడ్చి ఏడ్చి మొగం కడుక్కున్నట్టు" నవ్వుతూ ఆశ్చర్యంగా చూశాడతను. ఆమే అంది. "పెళ్లి చూపుల్లో నీ మొగంలో ఏ మాత్రం ఇష్టం కనిపించలా. పెద్దగా నా వేపు చూడలేదు. ఏ కాలేజీలో చదివేరని అడిగేవు కదా. బలవంతం మీద మాట్లాడినట్టుంది".

ఆమె ముఖం రెండు చేతుల్లోకీ తీసుకుని అన్నాడతను.

"నువ్వు నచ్చలేదని కాదు"

"I know"

"మరెందుకు ఒప్పుకున్నావు?"

"నువ్వు మంచివాడివని తెలిసింది. ప్రాబ్లం ఉండదు గదా?"

"ఏం, నా conduct certificate చూశావా?"

"అంతే అనుకో. మీ శర్మగార్ని మా అన్నయ్య అడిగాడు. ఆ పొగడ్తలన్నీ నాకు చెప్పేడు. అసలు నీ ప్రాబ్లం నీకు నచ్చక పోవడంకాదని అర్థమైంది".

"ఇంకా?"

"ఊ...పైగా, తరవాత అయినా మంచివాడు దొరుకుతాడని గేరంటీ లేదు. మంచిగా కనిపించే వాళ్లే ఎక్కువ. నాకు అప్పటికి 25 దాటేయి. అమ్మ రోజూ తినేసేది. మీ ఫేమిలీ నచ్చింది నాకు. నీ ఉద్యోగం అంటావా, అది అదృష్టం మీద ఆధారపడి ఉంటుంది. సరేనన్నాను. పెళ్లి చేసుకోడానికి ఇంతకంటే మంచి కారణం కావాలా? ఇంకో మాట చెప్పనా?"

"చెప్పు"

"నేను కాలేజీలో చదివేటప్పుడు కూడా నా ఫ్రెండ్స్‌కి ఉండే హీరో వర్షిప్ లేదు. షారుఖ్ కనిపిస్తే మూర్ఛపోయేవాళ్లు. అమీర్‌ని తల్చుకుని పక్కదాన్ని ముద్దు పెట్టుకునేవారు. ముద్దులే ముద్దులు". అతని వేపు చూసి అతని బుగ్గమీద ముద్దు పెట్టిందామె. ఆది ఆమెనే చూస్తున్నాడు. అతని చూపులో చిన్న ఆశ్చర్యం చురుక్కుమని తగిలిందామెకి. అతని కళ్ల ముందు అరచెయ్యి ఊపుతూ అందామె. "ఏంటి చూస్తున్నావు?"

"ఏం లేదు. నువ్వు బలే పద్ధతిగా ఆలోచిస్తావు". నవ్విందామె "నీ కెవరిష్టం?"

"వాళ్లందరూ ఇష్టవే. షారుఖ్ సినిమాలు అన్నీ నచ్చవు. అలాగే ఎవరేనా? బక్వాసంతా".

"ఇప్పుడు ఆమీర్ ఒచ్చి టీ తాగుదాం రమ్మంటే వెల్తావా?"

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Gede+Meedi+Pitta**

* * *